

కిడ్నీ రాకెట్ ప్రకంపనలు
రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారిన కిడ్నీ మార్పిడి రాకెట్ సంఘటన నల్లగొండలో ప్రకంపనలు సృష్టిస్తోంది. - 8లో



యాదగిరి క్షేత్రంలో భక్తుల రద్దీ
యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో రావడంతో రద్దీ నెలకొంది. - 8లో



యువకుల హల్‌చల్
కోదాడలో ఆదివారం కొందరు యువకులు జాతీయజెండాలు పట్టుకుని బైక్‌లపై తిరుగుతూ హైవేపై హల్‌చల్ చేశారు. - 8లో

న్యూస్‌రీల్

అదనపు కలెక్టర్లకు మున్సిపాలిటీల బాధ్యతలు

- ప్రత్యేక అధికారులుగా నియామకం
- కొనసాగనున్న నకిరేకల్ పాలకవర్గం

నల్లగొండ టూటౌన్ : ఉమ్మడి జిల్లాలోని 18 మున్సిపాలిటీల పాలకవర్గాల గడువు ఆదివారంతో ముగిసింది. మున్సిపాలిటీ ఎన్నికలు నిర్వహించకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీలకు అదనపు కలెక్టర్లను ప్రత్యేక అధికారులుగా నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారులుగా కొనసాగనున్నారు. నల్లగొండ జిల్లాలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్‌గా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తుండడంతో ఆయనే నల్లగొండ జిల్లాలోని మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారిగా ఉండనున్నారు. నకిరేకల్ మున్సిపాలిటీ పాలకవర్గం గడువు ఉండటంతో యథావిధిగా కొనసాగనుంది. మిగతా మున్సిపాలిటీలన్నింటికీ మున్సిపల్ ఎన్నికలు పూర్తయ్యే వరకు అదనపు కలెక్టర్లు బాధ్యతలు నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

మట్టపల్లి క్షేత్రంలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో ఆదివారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వేద మంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, మూలరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించారు. స్వామి అమ్మవార్లను నూతనపట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం జరిపారు. విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మధుపర్క పూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలతో కల్యాణతంతు పూర్తిచేశారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు కృషిచేయాలి



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా ఇన్‌చార్జి ప్రధాన జడ్జి శ్యామ్‌శ్రీ

చివ్వెంల: భారత రాజ్యాంగ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి ఎం.శ్యామ్‌శ్రీ అన్నారు. సూర్యాపేట జిల్లా కోర్టు ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన గణతంత్ర వేడుకలకు ఆమె హాజరయ్యారు. ముందుగా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. యువత రాజ్యాంగాన్ని గౌరవిస్తూ సమాజంలో బాధ్యతగా మెలగాలన్నారు. ఈ సందర్భంగా క్రీడాపోటీల విజేతలకు సూర్యాపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి, సీనియర్ సివిల్ జడ్జి ఫర్హీన్ కౌసర్, జూనియర్ సివిల్ జడ్జి అపూర్వ కవళి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి డపుకు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నారసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం గర్భాలయంలోని స్వయంభూలు, ప్రతిష్ఠా అలంకారమూర్తులను నిజాభిషేకం, తులసీదళ అర్చనతో కొలిచారు.ఇక ప్రథమ ప్రాకార మండపంలో పాంచరాత్ర ఆగమశాస్త్రానుసారంగా శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజలు నిర్వహించారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు చేపట్టారు. సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవను ఆలయ మాడ వీధిలో ఊరేగించారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రికి శ్రీస్వామి, అమ్మవార్లకు శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.



'రాష్ట్రంలోనే జిల్లాను అన్నిరంగాల్లో అగ్రభాగాన నిలిపేందుకు అహర్నిశలు కృషిచేస్తున్నాం. ఇందుకోసం ప్రతి ఒక్కరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నాం'
- జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండాను ఎగురవేసి సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

సమగ్రాభివృద్ధే ధ్యేయం

- ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందజేస్తాం
- 76వ గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్
- సూర్యాపేట పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయజెండా ఆవిష్కరణ
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు, స్టాళ్లు



భానుపురి జిల్లా సమాఖ్య సంఘాలకు రుణాల చెక్కు అందజేస్తున్న కలెక్టర్, ఎస్పీ

భానుపురి (సూర్యాపేట): జిల్లా సమగ్రాభివృద్ధే ధ్యేయంగా ప్రజల సహకారంతో ముందుకు సాగుతున్నామని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. ఆదివారం 76వ గణతంత్ర వేడుకలను జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించారు. ఈ వేడుకలకు జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్‌తో కలిసి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలోనే గొప్ప సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర దేశంగా నిలుపుకునేందుకు డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సారథ్యంలో భారత రాజ్యాంగం 1950, జనవరి 26న అమలులోకి తెచ్చుకున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే ప్రక్రియలో భాగంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు వంటి నాలుగు పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. జిల్లాలోని ప్రతి గ్రామంలో అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబాలకు లబ్ధి చేకూర్చాలనేది ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు.



మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది

రూ.59 కోట్ల బోనస్ చెల్లింపు

జిల్లా రైతాంగానికి మద్దతు ధర ఇచ్చేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రూ.526 కోట్ల విలువైన 2,26,854 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. 22,667 మంది రైతుల వద్ద 1.20లక్షల మెట్రిక్ టన్నుల సన్నధాన్యం కొనుగోలు చేసి క్వింటాకు రూ.500ల చొప్పున రూ.59 కోట్ల బోనస్‌ను రైతుల ఖాతాల్లో జమచేశామన్నారు. రూ.394.10 కోట్లతో చింతలపాలెం మండలం బుగ్గమాధవరం గ్రామం వద్ద చివరి ఆయకట్టు రైతులకు నీరు అందించేందుకు రాజీవ్‌గాంధీ ఎత్తిపోతల పథకం పని మంజూరైందన్నారు. రూ.1,996 కోట్లతో ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ లైనింగ్, జవహర్ జాన్‌పహాడ్ బ్రాంచ్ కెనాల్ లైనింగ్, ఇతర పనులు మంజూరయ్యాయని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకు జిల్లా పోలీస్ యంత్రాంగం నిరంతరం శ్రమిస్తోందన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించడానికి జిల్లా సైబర్ సెక్యూరిటీ టీం, పోలీస్ కళా బృందాలు పనిచేస్తున్నాయని తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికే భూభారతి

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చెప్పాలని భావించి ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే కాకుండా, భవిష్యత్‌లో లోపాలు, సమస్యలు లేని సమగ్ర, సుస్థిర భూపరిపాలన వ్యవస్థ ఏర్పాటుకు ఈ చట్టం దారి చూపబోతుందని పేర్కొన్నారు. జిల్లాలో 1.12లక్షల మంది రైతులకు రూ.845 కోట్ల రుణమాఫీ చేశామని తెలిపారు. జాతీయ ఆయిల్ పామ్ మిషన్ ద్వారా జిల్లాలో 913 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేయించామన్నారు.

ఆకట్టుకున్న జాగిలాల విన్యాసం

ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ ఆధ్వర్యంలో హంటర్ అనే జాగిలం హత్య నేరాలు, దొంగతనాలు జరిగినప్పుడు నిందితులను ఎలా గుర్తు పడతారో, అలాగే రోలెక్స్ అనే జాగిలం డ్రగ్స్, గంజాయి మత్తు పదార్థాలు ఉన్న బ్యాగ్‌లను ఎలా గుర్తు పడుతుందో చూపించి జాగిలాలు పరేడ్ గ్రౌండ్‌లో ప్రజలందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కోదాడ ఎమ్మెల్యే నల్లమాద ఉత్తమ్ పద్మావతిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, అదనపు కలెక్టర్ పి.రాంబాబు, అదనపు ఎస్పీ జనార్దన్‌రెడ్డి, డీఆర్‌డీఓ వీవీ.అప్పారావు, సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవ్, సీపీఓ కిషన్, డీపీఓ నారాయణరెడ్డి, డీఈఓ అశోక్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



భరతమాత వేషధారణలో చిన్నారి



గణతంత్ర వేడుకల్లో భాగంగా జాతీయ జెండాలను ప్రదర్శిస్తూ నృత్యం చేస్తున్న విద్యార్థినులు

అలరించిన ప్రదర్శనలు

విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అంతకుముందు స్వాతంత్ర్య సమర యోధులను ఘనంగా సత్కరించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందించారు. అలాగే సమాచార పౌర సంబంధాల శాఖ ఏర్పాటు చేసిన ఛాయా చిత్ర ప్రదర్శనను కలెక్టర్ ప్రారంభించారు. వివిధ శాఖల స్టాళ్లను జిల్లా ఎస్పీతో కలిసి కలెక్టర్ సందర్శించారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు - 8లో



పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో విద్యార్థుల కోలాట ప్రదర్శన

పథకాల అమలు అంతా బోగస్

- ఒక గ్రామాన్ని యూనిట్‌గా చేయడం సరికాదు
- ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలి
- మీడియాతో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట టౌన్: నాలుగు పథకాల అమలు కార్యక్రమం అంతా బోగస్సే అని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజా పాలన పథకాల్లో మండలానికి ఒక గ్రామం యూనిట్‌గా తీసుకుని లబ్ధిదారులను ఎంపిక చేయడం సరికాదన్నారు. నిన్నటి వరకు దరఖాస్తులు తీసుకుని తెల్లారే లబ్ధిదారుల ఎంపిక అంటున్నారని పేర్కొన్నారు. గ్రామ సభలు అన్నీ ఒక ప్రహసనంగా మార్చారని, రెండు సార్లు దరఖాస్తులు తీసుకుని బుట్టదాఖలు చేసి మళ్లీ దరఖాస్తులు ఎందుకని ప్రశ్నించారు. పైరవీ చేసుకున్న వారికి మాత్రమే లబ్ధి చేకూరుతుందని, గ్రామ సభలన్నీ ప్రజల నిరసనలతో మార్మోగాయన్నారు. మండలానికో గ్రామం, మార్చి 31 అంటూ ఇంకా ప్రజలను మభ్యపెడుతున్నారని ధ్వజమెత్తారు. డిసెంబర్ 9 అని చెప్పి ఇప్పుడు సంవత్సరానికి ఒక గ్రామంతో మొదలుపెట్టారని, రాష్ట్రమంతా పూర్తి చేయడానికి ఎంత సమయం తీసుకుంటారో చెప్పాలని డిమాండ్ చేశారు. హామీల అమలులో విఫలం అవుతున్నారని, ఒక్కొక్కటిగా కేసీఆర్ ఇచ్చిన కరెంట్ , నీళ్లు ఇవ్వలేక గప్పాలు కొడుతున్నారన్నారు. ఇందిరమ్మ బొమ్మ పెడితే పథకాలకు పైసలిీయమని హామీలు ఎగ్గొట్టడానికే కాంగ్రెస్, బీజేపీ లు డ్రామాలాడుతున్నాయని విమర్శించారు. ఒకరు రాష్ట్రానికి టోకరా వేస్తే మరొకరు దేశానికి వేస్తున్నారన్నారు. ప్రజలను మోసం చేస్తూ ప్రజల కోసం కొట్లాడుతున్న బీఆర్ఎస్‌పై కక్ష కడుతున్నారన్నారని, కాంగ్రెస్, బీజేపీ ఇద్దరూ తెలంగాణ ద్రోహులేనన్నారు. కాంగ్రెస్, బీజేపీల నైజం ప్రజలకు అర్థమై తిరుగుబాటుకు సిద్ధమతున్నారన్నారు. గ్రామ సభల ద్వారా ప్రజల వ్యతిరేకత మొదలైందని, కాంగ్రెస్ , బీజేపీ లకు రానున్న రోజుల్లో తెలంగాణ ఉద్యమం నాటి చుక్కలే చూపిస్తారన్నారు. ప్రభుత్వాన్ని నడపడం కాంగ్రెస్ కి చేతకావడంలేదన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి



సూర్యాపేటలో బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న కొత్తపల్లి శివకుమార్

భానుపురి (సూర్యాపేట): రైతాంగం పండించిన పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ కమిటీ పిలుపులో భాగంగా ఆదివారం ఆ పార్టీ ఆధ్వర్యంలో సూర్యాపేట పట్టణంలో నిర్వహించిన బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎన్నో వాగ్దానాలతో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రజా, రైతాంగ సమస్యలను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. నాలుగేళ్ల క్రితం నిర్వహించిన రైతాంగ ఉద్యమంతో దిగివచ్చిన కేంద్ర ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కారింగుల వెంకన్న, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్, నాయకులు పేర్ల నాగయ్య, ఎస్‌కే.సయ్యద్, గులాం హుస్సేన్, చిత్తలూరి లింగయ్య, గొగుల వీరబాబు, పుప్పాల అంజయ్య, కట్ట రమేష్, శేషగిరి, మోహన్, రాజేష్, ప్రసాద్, కల్పన తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి చిరునామా తెలంగాణ

- ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాల అమలు
- అర్హులందరికీ లబ్ధి చేకూర్చుతాం
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మహిళకు ప్రొసీడింగ్ కాపీ అందిస్తున్న మంత్రి తుమ్మల, చిత్రంలో జగదీష్‌రెడ్డి తదితరులు

సూర్యాపేట: సంక్షేమ రాష్ట్రానికి చిరునామాగా తెలంగాణ నిలిచిందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం సూర్యాపేట మండలం కేటీ అన్నారం గ్రామంలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి అధ్యక్షత ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు నాలుగు సంక్షేమ పథకాలు ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన ఒక్క ఏడాదిలోనే ఆరు గ్యారంటీలు అమలు చేశామన్నారు. సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు పార్టీలు ఇచ్చిన వాగ్దానాల మేరకు అన్ని పథకాలు అందజేయాలన్నారు. రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఒకేరోజు నాలుగు పథకాలు ప్రారంభించడం శుభపరిణామం అన్నారు. అంతకుముందు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ పైరవీలకు ఆస్కారం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం కృషిచేస్తుందన్నారు.

ప్రొసీడింగ్ కాపీలు అందజేత

అనంతరం కేటీ అన్నారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు 123 మంది ఉన్నారని, ఉయ్యాల ఉమ, వీరమల్లు యమున, నక్కల సుస్మిత, కొప్పు ఉమ, సాహిని రేస్మాలకు ప్రొసీడింగ్ కాపీలు అందించారు. నూతన రేషన్ కార్డులకు 104 మంది లబ్ధిదారులు ఉండగా కప్పల మౌనిక, మాద్గుల రమణ, నక్కల సంధ్య, కొణిదెల సుస్మా, వీరమల్లు త్రివేణిలకు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారులు 18 మందికి గాను గంధం లక్ష్మమ్మ, సామ లక్ష్మమ్మ, కూరెళ్ల జానకమ్మ, మహిళరాపు శాంతి, షేక్ షాతాబిలకు, రైతు భరోసా కింద 865 మంది రైతులకు గాను కప్పల పద్మ, నక్కల యాదమ్మ, కప్పల మంగమ్మలకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా ప్రొసీడింగ్ కాపీలు అందజేశారు. మిగతావారికి శాఖల వారీగా ఏర్పాటు చేసిన స్టాళ్లలో ప్రొసీడింగ్ కాపీలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు కొప్పుల వేణారెడ్డి, అధికార ప్రతినిధి చకిలం రాజేశ్వర్‌రావు, ఆర్డీఓ వేణుమాధవ్, డీఆర్‌డీఓ వీవీ అప్పారావు, డీఏఓ శ్రీధర్‌రెడ్డి, డీఎస్ఓ రాజేశ్వర్, డీపీఓ నారాయణరెడ్డి, తహసీల్దార్ శ్యామ్ సుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పండుగలా పథకాల ప్రారంభోత్సవం

- జిల్లాలో నాలుగు సంక్షేమ పథకాలకు శ్రీకారం
- మండలానికి ఒక్కో గ్రామం చొప్పున ఎంపిక
- లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలు అందజేత



ఉయ్యాలవాడలో ప్రొసీడింగ్ కాపీలు అందుకున్న లబ్ధిదారులతో అదనపు కలెక్టర్ రాంబాబు

భానుపురి (సూర్యాపేట): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డుల పంపిణీ పథకాలను ఆదివారం జిల్లాలో పండుగ వాతావరణంలో ప్రారంభించింది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అమలు చేయనున్నట్లు ప్రకటించింది. ఇందుకు ఈనెల 21నుంచి నాలుగు రోజుల పాటు గ్రామ, వార్డుసభలను నిర్వహించి అర్హుల జాబితాలను ప్రకటించింది. ఇందులో అర్హుల పేర్లు లేకపోవడం చూసి ప్రభుత్వం తిరిగి మళ్లీ అర్హులను గుర్తించాలని భావించింది.

మండలానికో గ్రామం

నాలుగు సంక్షేమ పథకాలను ఈ నెల 26వ తేదీ నుంచి అమలు చేసేందుకు మండలానికో గ్రామాన్ని ఎంపిక చేశారు. జిల్లాలోని 23 మండలాలకు గాను 23 గ్రామాల్లో నాలుగు పథకాలకు లబ్ధిదారులను గుర్తించి ప్రొసీడింగ్ కాపీలను ఇచ్చారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారులకు ఆదివారం అర్ధరాత్రి తర్వాత వారి అకౌంట్లలో డబ్బులు జమకానున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు దశల వారీగా బిల్లులు చెల్లించనున్నారు. కొత్త రేషన్‌కార్డుదారులకు ఫిబ్రవరి నుంచి లబ్ధి చేకూరనుంది.

ప్రశాంతంగా ప్రొసీడింగ్ కాపీల పంపిణీ

నాలుగు పథకాల అర్హుల జాబితాలను ప్రదర్శించేందుకు ఈనెల 21 నుంచి 24వరకు చేపట్టిన గ్రామసభల్లో కొంత గందరగోళం నెలకొంది. అయితే ఎంపిక చేసిన గ్రామాల్లో అర్హులకు ప్రొసీడింగ్ పత్రాలు ఇచ్చే కార్యక్రమం సజావుగా సాగింది. సూర్యాపేట మండలం కేటీ అన్నారంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరై నాలుగు పథకాలను ప్రారంభించారు. ఎంపికైన వారికి ప్రొసీడింగ్ కాపీలు పంపిణీ చేశారు. ఇక జాజిరెడ్డిగూడెం మండలం ఉయ్యాలవాడలో జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు, పెన్‌పహాడ్ మండలం దుబ్బతండాలో రాష్ట్ర వికలాంగుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య నాలుగు పథకాల అర్హులకు ప్రొసీడింగ్ పత్రాలు ఇచ్చారు. మిగతా చోట్ల మండల స్పెషల్ ఆఫీసర్లతో పాటు మండల అధికారులు, గ్రామస్థాయి అధికారులతో కలిసి ఈ కార్యక్రమాన్ని పూర్తి చేశారు.

ప్రొసీడింగ్ కాపీలు అందుకున్న లబ్ధిదారులు

రైతు భరోసా	29,352 (నిధులు రూ.26.73 కోట్లు)
కొత్త రేషన్ కార్డులు	2,350
ఇందిరమ్మ ఇళ్లు	4,140
ఇందిరమ్మ ఆత్మీయ భరోసా	1,458





సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించిన విద్యార్థులతో కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్



సన్మానం పొందిన స్వాతంత్ర్య సమరయోధులతో కలెక్టర్, ఎస్పీ, అడిషనల్ కలెక్టర్



స్టేజిపై ఎమ్మెల్యే పద్మావతి, కలెక్టర్ తేజస్ నందలాల్, ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్, అడిషనల్ కలెక్టర్ రాంబాబు



గణతంత్ర వేడుకల్లో సాంస్కృతిక ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు



కుటుంబ సభ్యులతో కలెక్టర్ తేజస్ నందలాల్, ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్,



కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్, ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న జిల్లా రవాణా అధికారి సురేష్‌రెడ్డి

ఉత్తమ సేవలకు గుర్తింపు

విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన ఆయా శాఖల అధికారులకు గుర్తింపు లభించింది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్, ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.



టి.రాజేశ్వర్, జిల్లా పౌరసరఫరాల అధికారి

డీఎస్‌ఎస్.ప్రసాద్ జిల్లా మేనేజర్ పౌర సరఫరాలశాఖ

సీతారామయ్య, జిల్లా రోడ్లు భవనాల శాఖ అధికారి

బి.ఫ్రాంక్లీన్, పర్యవేక్షక ఇంజనీర్

నారాయణరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి

కె.మాధవి, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్



శ్యామ్ సుందర్ ప్రసాద్, జిల్లా ఆడిట్ అధికారి

సీహెచ్.బాపూజీ లీడ్ బ్యాంక్ మేనేజర్

శ్రీనివాస్,మున్సిపల్ కమిషనర్ సూర్యాపేట

ఏడు కొండలు, జూనియర్ అసిస్టెంట్ కలెక్టరేట్

భిక్షంరెడ్డి, కలెక్టరేట్ జూనియర్ అసిస్టెంట్

వి.శ్రీనివాసులు, రెవెన్యూ డివిజనల్ అధికారి సూర్యాపేట

కె.హిమబిందు, తహసీల్దార్, అనంతగిరి

సీహెచ్ కృష్ణయ్య, తహసీల్దార్, చివ్వెంల

జె.శ్రీనివాసులు, తహసీల్దార్ జాజిరెడ్డిగూడెం

గోపి, మండల పంచాయతీ అధికారి, మేళ్లచెరువు

ఎస్.శ్రీనివాసరావు, అడిషనల్ గిర్దావర్, చివ్వెంల

అఖిల్, ఆఫీస్ సబార్డినేట్, కలెక్టరేట్,



ఎం.శ్రీధర్‌రెడ్డి, డీఎస్పీ కోదాడ

పి.వేణు, శానిటరీ జవాన్, సూర్యాపేట మున్సిపాలిటీ

శ్రావణ్‌కుమార్, శానిటరీ జవాన్ సూర్యాపేట మున్సిపాలిటీ

డి.రామకృష్ణారెడ్డి, సీఐ మునగాల

డి.శ్రీను, సీఐ తుంగతుర్తి

శివకుమార్, సీఐ సీసీఎస్ సూర్యాపేట

సీహెచ్ బాలకృష్ణ, ఎస్‌ఐ, అర్వపల్లి

జి.వెంకన్న, ఏఎస్‌ఐ, చివ్వెంల

జి.జ్యోతి, ఏఎస్‌ఐ డీసీఆర్‌బీ

హేమలత, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, సూర్యాపేట

టి.అశోక్‌రెడ్డి, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్, సూర్యాపేట



సయ్యద్ సమ్మీ, వాటర్ సప్లయ్ పంప్ రూమ్ డ్రైవర్

వెంకటరత్నం, టైపిస్ట్ డీపీఆర్‌ఓ కార్యాలయం, సూర్యాపేట

ఎం.సందీప్‌కుమార్, ఎస్పీ సీసీ సూర్యాపేట

పి.సంధ్య, ఆర్‌ఎంఓ ప్రభుత్వ ఆసుపత్రి, సూర్యాపేట

జి.ఆంజనేయులు, ఏఆర్ పోలీస్

అనిల్, రికార్డ్ అసిస్టెంట్ డీపీఆర్‌ఓ కార్యాలయం , సూర్యాపేట

రాజేశ్వరి, వాటర్ సప్లయ్ బిల్ కలెక్టర్, సూర్యాపేట

చిన్నపద్మ, శానిటేషన్ వర్కర్, సూర్యాపేట మున్సిపాలిటీ

దాసు, శానిటేషన్ వర్కర్, సూర్యాపేట మున్సిపాలిటీ

ఉపేందర్‌రెడ్డి, హోంగార్డు, సూర్యాపేట ఎస్పీ ఆఫీస్

రవీందర్, ఎక్సైజ్ కానిస్టేబుల్, సూర్యాపేట

కిడ్నీ రాకెట్ ప్రకంపనలు

- హైదరాబాద్‌లో అరెస్టయిన వారిలో నలుగురు నల్లగొండ వాసులే
- అలకనంద ఆస్పత్రిలో మెడికల్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న ఆ నలుగురు
- తాజా ఉదంతంతో తెరపైకి 2016 నాటి కిడ్నీ మార్పిడి వ్యవహారం



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారిన కిడ్నీ మార్పిడి రాకెట్ సంఘటన నల్లగొండలో ప్రకంపనలు సృష్టిస్తోంది. హైదరాబాద్ సరూర్‌నగర్‌లోని అలకానంద ఆస్పత్రిలో కిడ్నీ రాకెట్‌లో అరెస్టయిన వారిలో నల్లగొండకు చెందిన నలుగురు మెడికల్ అసిస్టెంట్లు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. 2016లో నల్లగొండలో జరిగిన కిడ్నీ రాకెట్ సంఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. ఆ రాకెట్‌లో జిల్లా కేంద్రానికి చెందిన యువకుడు డబ్బుల కోసం కిడ్నీ అమ్ముకొని, చివరికి అతనే ఏజెంట్‌గా మారాడు. ఆ సంగతి మరచిపోతున్న తరుణంలో ఇప్పుడు మళ్లీ హైదరాబాద్‌లో కిడ్నీ మార్పిడి రాకెట్ బయటపడింది. ఈ కేసును ఛేదించిన పోలీసులు ఆస్పత్రి వైద్యుడితోపాటు అందులో భాగస్వాములైన సిబ్బందిని అరెస్టు చేశారు. వారిలో అదే ఆస్పత్రిలో మెడికల్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న నల్లగొండ జిల్లాకు చెందిన నలుగురు వ్యక్తులు ఉండటంతో జిల్లాలో కిడ్నీ రాకెట్ ప్రకంపనలు మొదలయ్యాయి.

ఐదుగురిలో.. నలుగురు నల్లగొండ వారే

హైదరాబాద్‌లోని అలకనంద ఆస్పత్రిలో ఏడు నెలలుగా చట్టవిరుద్ధంగా కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేస్తున్న కేసులో రాచకొండ ఎస్‌టీటీ పోలీసులు శనివారం పలువురిని అరెస్టు చేశారు. అందులో అలకనంద ఆసుపత్రి ఎండీ గంటుపల్లి సురేష్, డాక్టర్ సిద్ధంశెట్టి అవినాష్, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ సోహిబ్‌ను అరెస్టు చేశారు. వారితోపాటు మెడికల్ అసిస్టెంట్లు ఐదుగురిని అరెస్టు చేశారు. వారిలో ఆస్పత్రి రిసెప్షనిస్ట్ నర్సగాని గోపి మినహా మిగతా నలుగురు నల్లగొండ జిల్లాకు చెందినవారే ఉన్నారు. వారిలో నల్లగొండలో నివాసం ఉంటున్న రమావత్ రవి, సపావత్ రవీందర్, సపావత్ హరీష్, పొదిల సాయి ఉన్నారు. వారంతా ఈ కిడ్నీ మార్పిడి రాకెట్‌లో అరెస్టు కావడంతో నల్లగొండ జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

మెడికల్ అసిస్టెంట్లేనా?

నల్లగొండకు చెందిన వారు కిడ్నీ మార్పిడి వ్యవహారంలో కేవలం మెడికల్ అసిస్టెంట్లుగా వ్యవహరించారా? పొట్టకూటి కోసమే అక్కడ ఉద్యోగంలో చేరారా? అన్నది తేలాల్సి ఉందన్న చర్చ సాగుతోంది. ఈ రాకెట్‌లో వారి పాత్ర ఏంటన్న దానిపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నల్లగొండ జిల్లా నుంచి కూడా కిడ్నీ విక్రయాలు జరిగాయా? అన్న సందేహం కలుగుతోంది. జిల్లా పోలీసులు కూడా ఈ అంశంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. పాత కేసుతో వీరికి ఏమైనా సంబంధం ఉందా? అన్న కోణంలో పరిశీలన జరిపి.. ప్రస్తుతం అరెస్టయిన వారికి అప్పటి కేసుతో సంబంధం లేదని పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు సమాచారం. తాజా కేసులో జిల్లా నుంచి కిడ్నీలు అమ్ముకునే దాతలను వీరు ఏమైనా సంప్రదించారా? అనే అంశంపై దృష్టి సారించినట్లు సమాచారం.

2016లో ఎలా జరిగిందంటే..

దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నల్లగొండలో కిడ్నీ మార్పిడి రాకెట్ 2016 జనవరిలో బయట పడింది. నల్లగొండకు చెందిన సురేష్ అనే యువకుడు హైదరాబాద్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చేస్తున్నాడు. అతని అవసరాలకు డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నాడు. అదే క్రమంలో ఆన్‌లైన్‌లో కిడ్నీదాతలు కావాలనే ప్రకటనతో అతను వారితో మాట్లాడి తాను కిడ్నీ ఇస్తానని ఒప్పుకున్నాడు. ఆ తరువాత ముంబైకి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకున్నాడు. ఆ తరువాత ప్రధాన ఏజెంట్లు అతన్ని శ్రీలంకలోని కొలంబోలోని వెస్టర్న్ ఆస్పత్రికి తీసుకెళ్లి అక్కడి దాతకు కిడ్నీ ఇచ్చాడు. అందుకుగాను రూ.5 లక్షలు వారి నుంచి సురేష్ తీసుకున్నాడు.

బాధితుడి నుంచి ఏజెంట్‌గా..

మొదట ఆర్థిక అవసరాలం కోసం కిడ్నీ అమ్ముకున్న సురేష్‌కు కిడ్నీల వ్యాపారం ద్వారా డబ్బు సంపాదించాలనే ఆలోచన వచ్చింది. తనకు పరిచయమున్న వారిని డబ్బు ఆశ చూపెట్టి కిడ్నీల వ్యాపారానికి తెరతీశాడు. ఇదే క్రమంలో నల్లగొండలో సస్పెండ్ అయిన ఉద్యోగి పరిచయం కావడం, అతడి కిడ్నీ కూడా విక్రయించేలా ఒప్పించాడు. కిడ్నీ ఇచ్చినందుకు బాధితుడికి రూ.5 లక్షలు, ఏజెంట్‌గా సురేష్‌కు రూ.50 వేలు ఇచ్చారు. ఇలా నల్లగొండ జిల్లాలో ముగ్గురు, హైదరాబాద్‌లో నలుగురు, బెంగుళూరులో నలుగురు, తమిళనాడులో ఇద్దరు కిడ్నీలు ఇచ్చేలా ఒప్పించి కమీషన్ పొందాడు. సోషల్ మీడియా ద్వారా కిడ్నీల వ్యాపారాన్ని ఢిల్లీ, అహ్మదాబాద్ తదితర ప్రాంతాలకు విస్తరించాడు. ఈ వ్యవహారం నల్లగొండ పోలీసులకు చేరడంతో అప్పటి ఎస్పీ విక్రమ్‌జిత్ దుగ్గల్ ఆదేశాల మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. నల్లగొండలో సురేష్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా 2014 నుంచే ఈ కిడ్నీ మార్పిడి రాకెట్ జరిగినట్లు బయటపడింది. కిడ్నీలు అమ్ముకునే వారికి ముంబైలో వైద్య పరీక్షలు నిర్వహించి, కొలంబోలోని వెస్టర్న్, నవలోక్ ఆస్పత్రుల్లో కిడ్నీల మార్పిడి చేశారు. ఈ వ్యవహారంలో విదేశీ డాక్టర్లు కూడా ఉండటం గమనార్హం.

ఢిల్లీలో గణతంత్ర వేడుకల్లో సతీష్



గరిడేపల్లి: దేశ రాజ ధాని ఢిల్లీలో ఆదివారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో గరిడేపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన డప్పు కళాకారుడు అమవరపు సతీష్ పాల్గొన్నారు. తనకు గణతంత్ర వేడుకల్లో పాల్గొనేందుకు అవకాశం రావడంతో ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ అవార్డు గ్రహీత అందె భాస్కర్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణకు సతీష్ కృతజ్ఞతలు తెలిపారు.

యాదగిరి క్షేత్రంలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. గణతంత్ర దినోత్సవంతో పాటు ఆదివారం సెలవురోజు కావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధికంగా తరలివచ్చారు. ధర్మ దర్శనానికి 3గంటలకు పైగా సమయం పట్టగా.. వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టింది. స్వామివారిని 30వేల మందికి పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

ఒకే దేశం.. ఒకటే ప్రజలు.. మనమంతా ఒకటే

- మఠంపల్లి నుంచి హుజూర్‌నగర్‌కు జాతీయజెండాతో 12 కిలోమీటర్ల పరుగు

మఠంపల్లి: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మఠంపల్లికి చెందిన సామాజిక కార్యకర్త గూడ నరసింహారావు ఒకే దేశం.. ఒకటే ప్రజలు.. మనమంతా ఒకటే.. అనే నినాదంతో జాతీయ జెండాతో మఠంపల్లి నుంచి హుజూర్‌నగర్‌కు 12 కిలోమీటర్ల పరుగుతీశాడు. ఈ సందర్భంగా స్థానికులు ఆయనకు అభినందనలు తెలిపారు. కుల, మత, వర్గ, విచక్షణకు మనమంతా దూరంగా ఉండాలని ఆశిస్తూ పరుగు తీసినట్లు నరసింహారావు తెలిపారు.



మఠంపల్లి నుంచి హుజూర్‌నగర్‌కు పరుగుతీస్తున్న గూడ నరసింహారావు

యువకుల హల్‌చల్

- జాతీయ జెండాలతో బైక్‌లు, కార్లపై విన్యాసాలు
- భయభ్రాంతులకు గురైన కోదాడ పట్టణ వాసులు

కోదాడ: కోదాడ పట్టణంలో ఆదివారం కొంతమంది యువకులు హల్‌చల్ చేశారు. ఒక్కో బైక్‌పై ముగ్గురు నలుగురు కూర్చొని సైలెన్సర్లు తీసివేసి భారీ శబ్దం చేసుకుంటూ జాతీయ జెండాలను పట్టుకొని పట్టణంలోని ప్రధాన రహదారిపై విన్యాసాలు చేశారు. మరికొందరు జాతీయ జెండాలను ఇష్టమొచ్చినట్లు కార్లకు కట్టి ర్యాలీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ల ముందు నుంచే ఈ ర్యాలీలు నిర్వహించినా పోలీసులు వారిని వారించే ప్రయత్నం చేయకపోవడం గమనించదగ్గ విషయం. ఈ ర్యాలీలతో పట్టణవాసులు భయభ్రాంతులకు గురయ్యారు. పలుచోట్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. యువకులు ర్యాలీలు ముగించుకొని ఎంఎస్ కళాశాల వద్దకు వెళ్తున్న సమయంలో ఇద్దరు పోలీసులు వచ్చి వారిని అదుపులోకి తీసుకొనేందుకు ప్రయత్నించగా.. వారిని లెక్క చేయకుండా యువకులంతా అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఆత్మీయ సమ్మేళనం

సూర్యాపేట: సూర్యాపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల - 2లో 1975-76 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమతో కలిసి చదువుకున్న వారిని కలుసుకొని ఆనాటి అనుభవాలను నెమరువేసుకున్నారు. అనంతరం తమ గురువులు ఎస్. లక్ష్మయ్య, దేవయ్య, చిన్నయ్యలను సత్కరించారు. కార్యక్రమంలో జ్ఞానభాస్కర్, గుండా రమేష్, గజ్జల రవీందర్, ఎన్ రంగరావు, పద్మ, కిరణ్మయి, శారద, రేణుక, నంద్యాల దయాకర్‌రెడ్డి, యామా ప్రభాకర్, సత్యం, శ్రీనివాస్, సత్తిరెడ్డి, మధు, గురునాథం తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు